## మందుబాబులకు అడ్డాగా పీలేరు అగ్రిల్యాబ్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మాణం పూర్తికాని అగ్రి ల్యాబ్ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రిళ్ళలో ఆ భవనం అసాంఘిక కార్యక్రమాలకు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నారని పీలేరుకు చెందిన అన్నమయ్య జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గ రైతులకు విత్తనాలు పురుగుల మందులు, ఎరువులను ఈ అగ్రి ల్యాబ్ లో పరీక్షించి సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ, గత మూడు సంవత్సరాలుగా ఈ భవనం నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. చివరికి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ భవనం నిర్మాణం పనులను పునఃప్రారంభించాలని, నిర్మాణం పనులు పూర్తి చేసి, పీలేరు అగ్రి ల్యాబ్ రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నియోజకవర్గ రైతుల తరపున బోధిషా వలి కోరారు.

# గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

### - రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

ఒంటిమిట్ట :రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/ఒంటిమిట్ట

రాష్ట్ర వ్యాప్తంగా గోతులు పడిన రహదారులకు మరమ్మతులు చేపట్టి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రాజంపేట, ఒంటిమిట్ట పరిధిలో గుంతల రోడ్లను పరిశీలించారు. తొలుత రాజంపేట ఆర్అండ్‌బి అతిథి గృహంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లెలో పాట్‌హోల్ ఫ్రీ ఎపి కార్యక్రమం (గుంతల రహిత రోడ్ల)లో భాగంగా ఆర్అండ్‌బి అధికారులతో కలిసి మంత్రి రోడ్ల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం రూ.4.9 లక్షలతో మల్లకాటిపల్లి నుండి బెస్తవారిపల్లి వరకు 11 కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారుల మరమ్మతుల పనులను ప్యాచ్ వర్క్ పనుల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి నాటికల్లా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా రహదారుల మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో రహదారులన్నీ గుంతలమయంగా మారడంతో, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర రహదారుల మరమ్మతుల పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.860 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రోడ్లు, భవనాల, పరిశ్రమల, పర్యాటక శాఖలను, వ్యవస్థలన్నిటిని నిర్వీర్యం చేశారని వాటిని గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు అందరూ నష్టపోయారన్నారు. పిపిపి మోడల్‌లో రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.3 వేల కోట్లు వెచ్చించనున్నామని తెలిపారు. భారత్ మాల కార్యక్రమంలో భాగంగా రూ.28 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా మొత్తంగా దాదాపుగా రాష్ట్రంలో రహదారులన్నింటికీ రూ.70 వేల కోట్లతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. మొదటగా వృద్ధాప్య పెన్షన్లను రూ.4000కి పెంచి ఒకటో తేదీన ఇంటింటికి పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను దీపావళి నుంచి మొదటి విడతగా మంజూరు చేయడం జరిగిందన్నారు. దశలవారీగా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రజలందరికీ అందివ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొదటి దశలో 110 పనులకు గాను జిల్లాకు రూ.15.97 కోట్లు నియోజకవర్గాల వారిగా మంజూరు చేశామన్నారు. 657.635 కిలోమీటర్ల మేర రహదారుల్లో గుంతలను పూడ్చడం జరుగుతుందని తెలిపారు ఇప్పటివరకు 15 శాతం పనులు పూర్తి అయ్యాయని డిసెంబర్ చివరినాటికి పనులన్నీ పూర్తవుతాయని తెలిపారు. రెండో దశలో 169 పనులకు గాను రూ.22.08 కోట్లు మంజూరు చేశామన్నారు. 830.47 కిలోమీటర్ల మేర రహదారులకు ఏర్పడిన గుంతలను పూరుస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచామని తెలిపారు. వచ్చే సంక్రాంతి లోపల పూర్తి చేసి గుంతల రహిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, కడప ఆర్అండ్‌బి ఇఇలు నాగేశ్వరరెడ్డి, మాధవి, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి, డిఇ షేక్ షావలి, ఎఇ గంగిరెడ్డి, ఒంటిమిట్ట తహాశీల్దార్ రమణమ్మ, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల అధ్యక్షులు నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్ వెంకట నరసయ్య పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

### - బీడీ, సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు

బీడీ కార్మికులతో మాట్లాడుతున్న ఓబులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీడీ, సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కొత్తపల్లి, బిరాన్ సాహెబ్, వీధి, కొలిమివీధి, ముస్తఫా మజీద్, మహబూబ్ నగర్‌లోని బీడీ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల సంక్షేమ సెస్, ఫండ్ చట్టం కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. మరో వైపు బీడీ కార్మికులకు ఉపయోగమైన సంక్షేమపతకాలు కొనసాగుతాయని పార్లమెంట్ మంత్రిత్వ శాఖ పేర్కొన్నదన్నారు. కానీ బీడీ యాజమాన్యాలు ప్రభుత్వం నిర్దేశించిన వేతనాలు చెల్లించకపోగా ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించడం లేదన్నారు. గతంలో బీడీ యాజమాన్యల నుండి ప్రభుత్వం వసూలు చేసి 1 శాతం సంక్షేమానికి ఖర్చు చేసేదని ఇప్పుడు 27 శాతం జిఎస్‌టి పేరుతో యాజమాన్యాల నుండి గుంజుతున్నప్పటికీ ఒక్క రూపాయ కూడా సంక్షేమానికి ఖర్చు చేయలేదని తెలిపారు. అందుకే బీడీ కార్మికులకు సంక్షేమపథకాలు బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య సంబంధమైన డిస్పెన్సరీలలో వైద్య సౌకర్యాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోద్య బీమా వర్తింపు చేయాలన్నారు. కేరళలో లాగా 1000 బీడీలు చుడితే రూ.500లు కూలి ఇవ్వాలని కోరారు. అసిస్టెంట్ లేబర్ కమిషన్ జోక్యం చేసుకుని బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని లేని పక్షాన లేబర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా బీడీ కార్మిక సంఘం స్థానిక బాధ్యులు డి.భాగ్యలక్ష్మి, సిఐటియు నాయకులు మాధవయ్య, బీడీ కార్మికులు నసీమా, తస్లీమ్, కదిరున్నిసా, అయేషా, రజియా బేగం, నసీబ్ జాన్, హాజీరా, ముంతాజ్ పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

### - ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి మోనిస్

పాఠశాలలో ఎన్‌సిసి క్యాడెట్లతో కమాండింగ్ ఆఫీసర్ ఎన్‌వి మోనిస్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని 35వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎన్.వి.మోనిస్ అన్నారు. గురువారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత, సేవాభావం అలవర్చుకోవాలన్నారు. అనంతరం హెచ్‌ఎం సావిత్రి మాట్లాడుతూ ఎన్‌సిసి యూనిట్ స్థాపించడం వలన పాఠశాలలో క్రమశిక్షణ అలవడిందని, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ లోగనాథన్, ఎన్‌సిసి ఆఫీసర్ మహేష్ రాయ్, నంద రామ్, పాఠశాల కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజ, రమణప్ప, నాగేశ్వర, శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లి :** మిట్స్ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్స్ పేరెంట్స్ మీట్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 35వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎన్.వి.మోనిస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫాం యువజన దళంగా ఎన్‌సిసి ప్రసిద్ధి పొందిందని తెలిపారు. రేపటి పౌరుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌సిసి ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఆధునిక విద్యా వ్యవస్థలో ప్రతి విద్యార్థి ఎన్‌సిసి చోటు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. ఎన్‌సిసిలో శిక్షణ అనంతరం అందించే ఎ, బి, సి సర్టిఫికెట్లు విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. క్యాడెట్స్ వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యకమంలో కళాశాల ఎన్‌సిసి లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ లోగనాథన్ పాల్గొన్నారు.

# కట్టుదిట్టంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు

### - కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికలపై జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన 167 చెరువులకు సంబంధించి డిసెంబర్ 8న నీటివినియోగదారుల, సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 5వ తేది సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడు తుందన్నారు. డిసెంబరు 8వ తేదీ ఒకే రోజు పూర్తి ఎన్నికల ప్రక్రియ ఉంటుందిన్నారు. నామినేషన్ల ప్రక్రియ, 6 మంది ప్రాదేశిక సభ్యుల, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికలను పార్టీలకతీతంగా సుహృద్భావ వాతావరణంలో వీలైనంత వరకు ఏకగ్రీవ తీర్మానాలతో జరపాలని ప్రభుత్వం భావిస్తుందని ఆ మేరకు జిల్లాలో కూడా పటిష్టంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎన్నిక అనంతరం సదరు సాగునీటి సంఘాల ద్వారా రైతులు తమ చెరువులను తామే ప్రభుత్వ సహకారంతో నిర్వహించుకోగలుగుతారని చెప్పారు. ప్రతి సాగునీటి సంఘంలో 6 మంది ప్రాదేశిక సభ్యులు ఎన్నికవుతారన్నారు. వారిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నికవుతారని తెలిపారు. ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి, స్థానిక సంస్థల ఎన్నికలకు కావలసిన అన్ని సాధారణ అర్హతలతో బాటు 1432 ఫస్లీ వరకూ నీటి తీరువా చెల్లించిన రైతులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విసిలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహాశీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

జిల్లాలో ఈనెల 30న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను నూరు శాతం పంపిణీ చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని విసి హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇంజినీరింగ్ సిబ్బంది, ఎంఇఒలు, ఎంఎఒ, ఇఇలు, డిఇలు, ఎఇలు, సచివాలయ సిబ్బంది తదితరులతో పింఛన్ల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు, రెవిన్యూ సర్వీసులు, పల్లె పండుగ పనులు, విద్యార్థులకు అపార్ ఐడీల మంజూరు, బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్, సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు, ప్రజా పంపిణీ వ్యవస్థ, పశుగణన, పంటల ఈ క్రాప్, సిసి కార్డుల జారీ తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30వ తేదీన పింఛను పంపిణీ చేసే సిబ్బంది అందరూ తెల్లవారుజామున ఐదున్నర గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలని, ఉదయం 6 గంటలకు తప్పనిసరిగా పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి శుక్రవారమే బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాటులకు తావు ఇవ్వకుండా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సిఇఒ కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై తహాశీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో తప్పనిసరిగా మాట్లాడి నాణ్యతతో అర్జీలను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తులను కూడా నిరీ?త కాల పరిమితిలోగా నాణ్యతతో వేగంగా పరిష్కరించాలన్నారు. ఎమ్మార్వోలు ఆధార్ మంజూరు కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు.

పివిసి ప్రభుత్వ పాఠశాలలో ఆధార్ సెంటర్ వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

## ఆధార్ కోసం నిరీక్షణ

### - అవస్థలు పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అపార్ కార్డుల కోసం విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఇంటి పేరు మార్పులు చేసేందుకు మండలంలోని జర్రావారిపల్లి, స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసింది. బర్త్ సర్టిఫికెట్‌తో పాటు అవసరమైన పత్రాలు ఉన్నా.. ఆధార్‌లో మార్పులు చేసే వ్యక్తులు సర్వర్ పని చేయడం లేదంటూ కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తుండడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భగ్గుమంటున్నారు. గురువారం ఉదయం నుంచి విద్యుత్‌కి అంతరాయం కలగడంతో కనీసం పది మందికి కూడా ఆధార్‌లో మార్పులు చేయలేకపోతున్నారు. గంటల తరబడి ఆధార్ సెంటర్ల వద్ద తిండి, నీరు లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా ఆధార్‌లో మార్పులు చేసి ఇస్తున్న క్యాస్ రిసిప్టులో రూ.50 ఉంటే వంద వసూలు చేస్తున్నారని, మిగిలిన సర్వీసులకు క్యాస్ రిసిప్టులో డబ్బులు ఏమి లేకపోయినా కూడా వంద వసూలు చేస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## భగత్‌సింగ్ కాలనీలో రోడ్డు కోసం వినతి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో సిసి రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తూ ఐటియుసి నాయకుడు కృష్ణమూర్తి, కాలనీవాసులతో కలిసి గురువారం ఎంపిడిఒ తాజ్ మస్రూర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో, కాలనీల్లో సిసి రోడ్లు, మురికినీటి కాలువ నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. భగత్ సింగ్ కాలనీలో కూడా రెండు మూడు చోట్ల సిసి రోడ్లు వేస్తున్నప్పటికీ అధ్వానంగా ఉన్న రోడ్లను వదిలేసి అంత ప్రాముఖ్యత లేని ప్రాంతాల్లో రోడ్లు వేస్తున్నారని తెలిపారు. కొన్ని రోడ్లు తీవ్రంగా కోసుకుపోయి గులకరాళ్లు, మట్టితో చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. ఆ రోడ్లపై పలువురు కిందపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కాలనీలో విచారణ చేపట్టి ముందుగా ఏ ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల అవసరము ఎక్కువగా ఉందో గుర్తించి మొదటి ప్రాధాన్యతగా వాటిని పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపిడిఒ తాము పర్యవేక్షించి అవసరమైన చోట తప్పక సిసి రోడ్ల నిర్మాణాలు చేపడతామని వారికి తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సిద్దయ్య, రమణారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

## అవినీతి నిరోధక ఫోరం ఏర్పాటు : మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** అవినీతి నిరోధక పోరులో భాగంగా అవినీతి రహిత సమాజం కోసం, అవినీతి నిరోధానికి న్యాయకోవిదులతో కలసి సంబంధిత వేదికల ద్వారా అవినీతి నిరోధానికి పార్టీ లకతీతంగా సహయ సహకారం అందించనుందని మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ న్యాయ కోవిధుల ఫోరంను ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా అవినీతిపరుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వారికి ఫోరం అండగా ఉంటుందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం అవినీతిని నిరోధించడమే ఈ ఫోరం లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం : వైసిపి

సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్ అహమ్మద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసి వీరబాదుడు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ధరలు పెరిగి పేదలు గగ్గోలు పెడుతుంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తాం, పేదవారిని లక్షాధికారులు చేస్తామంటూ తండ్రి, కొడుకులు ఊరురూ తిరిగి గద్దెనుక్కిన వెంటనే ఖజానా ఖాళీ అంటూ చెప్పడం, 40 ఏళ్ల ఇండస్ట్రీ చంద్రబాబునాయుడుకు తెలియదా అని ప్రశ్నించారు. ఆనాడు బాదుడే బాదుడు అని తిరిగిన చంద్రబాబునాయుడు ఇప్పుడు చేస్తున్నదేమిటి, వీర బాదుడు కాదా అని పేర్కొన్నారు. నాణ్యమైన కరెంట్ ఇస్తామని విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు కరెంటు బాదుడు బాదుతున్నారని తెలిపారు. నాడు లోకేష్ రైతులను ఉద్దేశించి స్మార్ట్ మీటర్లు ఎవరూ పెట్టుకోవద్దని, అవి బిగిస్తే బద్దలు కొట్టాలని చెప్పి, ఇప్పుడు కేంద్రంతో కుమ్మక్కై స్మార్టుగా స్మార్టు మీటర్లు బిగించేస్తున్నారని పేర్కొన్నారు. ఇది రైతులను మోసం చేసినట్లు కాదా అని సూటిగా ప్రశ్నించారు. అన్ని నిత్యావసర ధరలను ఇష్టానుసారం పెంచేశారని, నూనె దగ్గర నుండి పప్పులు, ఉప్పులు, కూరగాయల రేట్లు అమాంతం పెరిగాయని, వైసిపి ప్రభుత్వంలో ఉన్న ధరలను ప్రజలకు ఒక్కసారి గమనించాలన్నారు. పేరుకే ఉచిత ఇసుక అని, భవన నిర్మాణానికి ఇసుక దొరకడం లేదని, వైసిపి హయాంలోనే ఇసుక సక్రమంగా అందేదని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ ఎప్పుడని విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్ ఈశ్వరయ్య, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, అనంత మునిశేఖర్, నూరుల్లా, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లి మహేష్, చరణ్, యూనిస్, సాధిక్, యాసిన్ పాల్గొన్నారు.

# పటిష్టంగా ఎంఎస్‌ఎంఇల సర్వే : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 29 నుంచి ఎంఎస్‌ఎంఇల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎంఎస్‌ఎంఇల సర్వే అంశంపై జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఎంఎస్‌ఎంఇ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) సర్వే శుక్రవారం అనగా రేపటి నుంచి ప్రారంభం కానుందని వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటి వరకు ఈ సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఇ సర్వే నిర్వహించడంలో మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు వాటి విధివిధానాలపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంఎస్‌ఎంఇ సర్వే 2024ను తిరిగి ప్రారంభించడం జరిగిందని, అందువల్ల అన్ని ఎంఎస్ ఎమ్‌ఎలు పరిశ్రమలు, సేవా రంగాలు, వ్యాపార సంస్థలు ఉద్యంబ రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలని తెలిపారు. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు పరిశ్రమల శాఖ అధికారులు, కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. పోటీతత్వ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పరిశ్రమఅవసరాలపై స్పష్టమైన అవగాహన పొందడానికి ఎంఎస్‌ఎంఈ యూనిట్లలో సాంకేతిక ఉత్పత్తి, నిర్వహణ నైపుణ్యాలలో గలకారణాలను గుర్తించడానికి ఈ సర్వే ప్రక్రియను లక్ష్యంగా పెట్టుకున్నదని కలెక్టర్ తెలిపారు. వ్యాపార కార్యకలాపాల అన్ని వివరాలు సర్వే యాప్లో పొందుపరచడం వల్ల దేశ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని తెలుసుకొనుటకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా సచివాలయాల పరిధిలోని సిబ్బంది అందరూ ఎంఎస్‌ఎఈ సర్వేలో పాల్గొ నుటకు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ ఔత్సాహిక ఎంఎస్‌ఎంఇల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న బ్యాంకు అధికారులు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాయచోటి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి నవీన్ చిరినెల్లి, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. ఆర్‌బిఐ 90 వసంతాల సందర్భంగా గురువారం రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌తో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన 90 సంవత్సరాల సేవను జరుపుకుంటోందని పేర్కొన్నారు. ఆర్‌బిఐ 90వ సంవత్సర సేవను స్మారక కార్యక్రమాల శ్రేణితో గుర్తించిందన్నారు. ఆర్థిక స్థిరత్వానికి మాత్రమే కాకుండా స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు కూడా ఆర్‌బిఐ తన నిబద్ధతను చాటడమైందన్నారు. కార్యక్రమంలో జామ, మామిడి, నిమ్మ, జాము (నేరేడు), సపోటాతో సహా వివిధ రకాల ఫలాలను ఇచ్చే మొక్కలు నాటామని తెలిపారు. ఇది ధీర్ఘకాలిక పర్యావరణ ప్రయోజనాలు, సమాజ సంక్షేమంపై సంస్థ దృష్టికి ప్రతీకన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి గ్రీన్ కవర్‌ను పెంచడం యొక్క ప్రాముఖ్యతను కూడా ప్లాంటేషన్ డ్రైవ్ నొక్కి చెప్పిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ బాష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## రూ.3.60 కోట్ల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి మండలంలో రూ.3.60 కోట్ల నిధులతో పల్లెల్లో, పట్టణంలోని కాలనీలు, పలు వార్డుల్లో సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నట్లు ఎంపిడిఒ తాజ్ మస్రూర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.3 కోట్ల నిధులు వెచ్చించిందన్నారు. ఎన్నికలకు ముందు రూ.60 లక్షల నిధులు వచ్చాయన్నారు. పల్లె, పట్టణాల్లో సిసి రోడ్లు నిర్మాణాలను వేగవంతంగా చేపట్టామన్నారు. పలుచోట్ల ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యాయని, కొన్నిచోట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి ప్రాంతంలోనూ రోడ్ల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని నిధులు వెచ్చించి అన్ని ప్రాంతాల్లోనూ సిసి రోడ్లు, మురుకునీటి కాలువలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాడి ఆవుల ద్వారా జీవనాన్ని కొనసాగిస్తున్న రైతుల కోసం గోకులం షెడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆరు ఆవులున్న రైతుకు రూ.2.15 లక్షలు, 4 ఆవులున్న రైతుకు రూ.1.85 లక్షలు, రెండు ఆవులున్న రైతుకు రూ.1.15. లక్షలు కేటాయించామని పేర్కొన్నారు. పది శాతం రైతు నిధులు రైతు భరించుకోవాలని మిగిలిన 90 శాతం నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. మదనపల్లె మండలంలో 20 గోకులం షెడ్లు మంజూరు కాగా ఒక్కటే మినహా అన్ని యూనిట్లను రైతులకు కేటాయించడంతో పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

ఆహార భద్రతపై శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు

## ఆహార భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి-గుర్రంకొండ**

పెద్దమండెం మండలం కెజిబివి స్కూల్ విద్యార్థులకు మండల కేంద్రంలోని వినాయక బేకరీ వద్ద ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాణికుమారి మాట్లాడుతూ విద్యార్థులకు బేకరీలోని వివిధ రకాల పదార్థాలను ఎలా తయారు చేస్తారు, ఎలాంటి ఆహారం తీసుకుంటే పోషక పదార్థాలు పెరుగుతాయో విద్యార్థులకు వివరించారు. ఆహార భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులను టైమ్ సెంటర్ పార్ లర్నింగ్ లిమిటెడ్ వారు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. మండల కేంద్రంలోని వినాయక బేకరీలో విద్యార్థులను తీసుకువెళ్లి పలు పదార్థాలపై అవగాహన కలిగించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ ట్రైనింగ్ రద్దు చేయాలి

**ప్రజాశక్తి-రామాపురం**

ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ ట్రైనింగ్ కార్యక్రమాలు రద్దు చేయాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్ వల్ల ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారని అన్నారు. ఈ మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. అధికారుల మొండి పట్టుదలకు పోయి ఇద్దరు ఉపాధ్యాయులప్రాణాలు బలిగొన్నారనిఅన్నారు. గురువారం విజయ నగరం జిల్లాలోని గణపతి నగరం బాలాజీ పాలిటెక్నికల్ కాలేజీలో లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ఎస్.శ్రీనివాసరావు ఉపాధ్యాయుడు గుండ పోటుతో మృతి చెందడం ఉపాధ్యాయులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్ బదులు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే విధంగా డివిజన్ స్థాయిలో మండల స్థాయిలో నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ జీవితాలతో ఆడుకున్నా రాష్ట్రస్థాయి అధికారుల మొండి వైఖరి ఉపాధ్యాయుల మృతికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌టియు మైనార్టీ కన్వీనర్ మజాహరుల్‌హాక్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునిరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కిల్లారెడ్డి శేఖర్‌కి ఘన నివాళి

**ప్రజాశక్తి-కలకడ**

సామాజిక కార్యకర్తగా పేరొందిన మండలంలోని గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామానికి చెందిన కిల్లారెడ్డి శేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. రెడ్డి శేఖర్ మృతి కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు సోదరులు, తల్లిదండ్రులు ఉన్నారు. అంతిమ యాత్రలో ఎపిజివైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాయకులు పులి శ్రీనివాసులు, డాక్టర్ జానం గంగిరెడ్డి, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకులు కోనేటి దివాకర్, బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, మోహన్ ముత్యాల పాల్గొని నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంచి విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా శేఖర్ గుర్తింపు పొందారని కొనియాడారు.ఆయన మృతి పేదలకు తీరని లోటని అన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

## గుంతకల్ డివిజన్ బోర్డు మెంబర్‌గా భరత్ కుమార్‌రెడ్డి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

గుంతకల్ డివిజన్ డిఆర్.యుసిసి సభ్యులుగా తల్లెం భరత్ కుమార్‌రెడ్డి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ తనను రెండవ సారి గుంతకల్ డివిజన్ మెంబర్‌గా ఎంపిక చేసినందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. నన్ను నమ్మి రెండవసారి రైల్వే బోర్డులో సభ్యులుగా ఎన్నిక చేసినందుకు రైల్వే సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి నాతియా ముషాయిరా పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్**

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జాతీయ స్థాయి నాతియా ముషాయిరా పోస్టర్‌ను అంజుమన్ తరక్కీ ఉర్దూ ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ హాషీమ్ గురువారం కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని డిసెంబర్ 2న రాత్రి 9 గంటలకు గఫ్ఫార్ ఫంక్షన్ హాల్‌లో జాతీయ స్థాయి నాతియా ముషాయిరా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యకమానికి ముఖ్యఅతిథిగా రజి ఉద్దీన్ హుస్సేనీ సాహెబ్, అధ్యక్షులుగా డాక్టర్ సయ్యద్ వసీవుల్లా బుక్తియారీ గౌరవ అతిథులుగా జనాబ్ ఇక్యస్‌బాషా జనాబ్ షేక్ ఇమ్రాన్ హాజరవుతారని తెలిపారు. ముషాయిరాలో జాతీయ స్థాయి ప్రముఖ ఉర్దూ కవులతో పాటు స్థానిక కవులు పాల్గొంటారని అన్నారు. నాతియా ముషాయిరా ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమం లో కన్వీనర్లు షేక్ జాఫరుద్దీన్, షేక్ మునవర్ బాషా, షేక్ అమ్జద్ బాషా, సయ్యద్ సునీర్ ప్రముఖ ఉర్దూ కవులు సబాత్ ,గౌస్, సదా, నియాజ్, షఫీ పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE LAKKIREDDYPALLI**

**O.S.No. 27/2024**

Kalamula Saheb Peera ...**Plaintiff**

**Vs**

Kadiri Nagendra Babu And others ...**Defendants**

To,
Palle Vijayanand, S/o.Gangi Reddy, aged 66 years, P.G.R. Function Hall, Ramapuram Road, Lakkireddypalle.

**SUMMONS ORDER-5 RULE-1, 5 C.P.C.**

Whereas the plaintiff has instituted a suit against you for the plaint mentioned relief vide plaint copy attached herewith, you are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 3/12/2024 at 10.30 o'clock in the forenoon answer the claim and your are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence.

TAKE notice that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

GIVEN under my hand and the seal of the Court this day of 2023

**//By Order of the Court//**

**V.AZAMTHULLAH**
**Advocate for Plaintiff**
**Cell: 9963612791.**

**IN THE COURT OF THE MOTOR ACCIDENTS AND CLAIM TRIBUNAL OF MADANAPALLE**

**I.A.No. 202/2017**
**M.V.O.P. No. 17/2015**

I.Navaneetha & Others ...**Petitioners**

**Vs**

B.Sathya Narayana & Others ...**Respondents**

**NOTICE TO RESPONDENT NO.3**

To,
R3. Syed Nasir, S/o Abdul Rahiman, Opp.Metro Complex, Indira Nagar, Madanapalle, Annamaiah Dist.

పై దావాలోని మీరు రెస్పాండెంటు నెం.3గా చేర్చుటకుగాను పై తెలిపిన పిటిషను నందు మీకు ఎటువంటి Objections వున్నను తెలియజేయవలసిందిగా కోర్టు వారు ఆర్డర్స్ వేసి వున్నారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట తేది.20.12.2024న ఉ॥గం॥ 10.30 ని॥లకు హాజరు కావలెను. అట్లు కాని పక్షములో మిమ్ములను ఎక్సపార్టీగా తీర్మానించబడి ఉత్తర్వులు జారీ చేయబడును అని తెలియజేయడమైనది.

**N.S.N.PRASAD, LAKSHMI PRABHA**
**Advocate,**
**MADANAPALLE**

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

మదనపల్లి: జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

అణగారిన వర్గాల ఆత్మబంధువు మహాత్మ జ్యోతిరావుపూలే అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. గురువారం పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లి టమోటా మార్కెట్ యార్డ్ వద్ద గల పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజంలోని అణ గారిన వర్గాల విద్యాహక్కులు, సామాజిక సమానత్వం కల్పించేందుకు చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, సమసమాజ స్థాపన కోసం పరితపించిన చిరస్మరణీయుడని కొనియాడారు. ఆ మహనీయుడు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడ వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామిశెట్టి నీలకంఠ, బొమ్మి శెట్టి పురుషోత్తం, యర్ర బల్లి వెంకట్రమణా రెడ్డి, రామిశెట్టి కృష్ణ, నవీన్ చౌదరి, బెల్లె రెడ్డి ప్రసాద్, బీదం గురునాథ్ యాదవ్, జెసిబి మధు, జెసిబి వేణు, చెంద్రాయుడు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** విద్యను ప్రజాస్వామీకరించి, వర్ణ, వర్గ, కుల, మత, లింగ బేధాలు లేకుండా అందరికీ విద్యను చేరువ చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బాస్ కార్యాలయలో పూలే సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పూలే చిత్రపటాన్ని పూలతో అభిషేకించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శివప్రసాద్ మాట్లాడుతూ మనుస్మృతి విధించిన దుర్మార్గమైన నియమాలపై విద్య అనే ఆయుధంతో యుద్ధం ప్రకటించి భారత సమాజంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన పూలే దంపతులు ఎప్పటికీ చిరస్మరణీయులేనని చెప్పారు. సంఘ సంస్కర్త పూలే జీవితంపై ప్రజల్లో అవగాహన పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు నీరుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, బురుజు రెడ్డిప్రసాద్, శ్రీకాంత్, గంగాధర్, రవి శంకర్, కృష్ణ, హైదర్, బీసీ నాయకుడు శివకుమార్, చైతన్య అనాధ ఆశ్రమం చైర్మన్ ఎంపీ ఆనందన్ పాల్గొన్నారు. **పుల్లంపేట:** బడుగు బలహీనవర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావుఫూలే అని జనసేన నాయకుడు పసుపులేటి వెంకట రమణ కొనియాడారు.మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సంద ర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్త్రీలకు విద్య ఎందుకు అంటున్నా రోజుల్లో స్త్రీల కోసం పాఠశాలను ప్రారంభించి వారికి విద్యాబు ద్ధులు నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అనే కొనియా డారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలేనని బిసి సంఘం నాయకులు విజయభాస్కర్ పేర్కొన్నారు. జ్యోతిరావుఫేలే వర్ధంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసి వారిని చైతన్య పరిచిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి రామచంద్రయ్య, సుబ్బంాయుడు, నాగిరెడ్డి పురుషోత్తం, గంగరాజు, మణికంఠ, రామాంజి, చరణ్ కుమార్, సతీష్ కుమార్ పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** రాయచోటి వైసిపి జిల్లా కార్యాల యంలో మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మునిసిపల్ చైర్మన్ చైర్మన్ ఫయాజ్‌బాషా పార్టీ కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి నేతలు విజయభాస్కర్, పల్లపు రమేష్, సుగవాసి శ్యామ్ కుమార్, గాలివీడు వైస్ ఎంపిపి మదు భూషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫయాజర్, రెహమాన్, కౌన్సిలర్లు, కో1ఆప్షన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు యూసఫ్, నవాజ్ పాల్గొన్నారు.

రాయచోటి : జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వైసిపి నాయకులు

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

నిమ్మనపల్లి: బాల్య వివాహాలపై ర్యాలీ చేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ చేపట్టి అవగాహన కల్పిస్తున్నట్లు ఎపిఎం మురళి, ఎఒ రమేష్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి కందూరు రోడ్డు మీదుగా నిమ్మనపల్లె బస్టాండ్ వరకు వెలుగు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, గృహహింస వ్యతిరేకత, ఆడ మగ సమాన హక్కుల పైన అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు పూర్త యిన తర్వాతే వివాహం చేయాలని, అందుకు భిన్నంగా చిన్న వయసులో వివాహాలు చేస్తే చట్టారీత్యా నేరమని అన్నారు. ఆ వివాహాన్ని బాల్య వివాహంగా పరిగణించి తగిన వారిపై చట్టప రంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వివాహ వయసు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలని అన్నారు. చిన్నవయసులో వివాహాలు చేయడం ద్వారా వారికి కుటుం బంపై అవగాహన, శారీరక, మానసిక పరిపక్వత, జీవితంపై అవగాహన లేకపో వడంతో కుటుం బాలు చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందని అన్నారు. బాల్యంలోనే వివాహాలు చేసు కోవడం ద్వారా గర్భస్థ దశలో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. సమాజంలో ఆడ మగ ఇద్దరూ సమానమేనని వివరించారు. గృహహిం సాలను అరికట్టాలని అవగాహన కల్పించారు. ప్రజలకు కొంతమేర బాల్య వివాహాలపై చైతన్యం కలిగిన ఇప్పటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగు తున్నాయని వాటిని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే 1098 లేదా 100 కు ఫోన్ చేసి సమాచారం అందిం చాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఒ రమేష్ బాబు, ఎపిఎం మురళి, సిసిలు, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.**బి.కొత్తకోట:** ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు పిటిఎం ఎస్ఐ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ప్రజలకు బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పిటియంలోని కస్తూర్బా హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో పిటిఎం జంక్షన్‌లో బాల్య వివాహాలు,మహిళలపై జరుగుతున్న అగాయిత్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని, నేరం.బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి బాల్య వివాహాలు ఆటంకం కలిగిస్తాయన్నార ఇందులో పాల్గొన్న వారందరి చేత బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. **రాజంపేట అర్బన్ :** గ్రామాల్లోని పెద్దలు వయసుతో సంబందం లేకుండా బాల్య వివాహాలు చేస్తే చట్ట రీత్యా నేరమని ఐసిడిఎస్ రాజంపేట సిడిపిఒ పి.నిర్మల అన్నారు. గురువారం ఆమె రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి బాల్య వివాహాలు ఏ విదంగా నిర్మూలించాలి, ప్రస్తుతం బాల్య వివాహాలు జరిపించిన వారిపై, వాటిని ప్రోత్సహించిన వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో తెలిపారు. కార్యక్రమములో సెక్టార్ సూపర్‌వైజర్ కె.రాణెమ్మ , సుబ్బలక్షుమ్మ, జె.శంకరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట : ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

# 'ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరు'

ఎన్‌సిసి విద్యార్థులతో కల్నల్ ఎల్‌వి.మోనిష్

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశం పట్ల భక్తి భావం, క్రమ శిక్షణ కలిగి ఉండాలని ఎన్‌సిసి(35ఎ బిఎన్) బెటాలియన్ కమాం డింగ్ అధికారి కల్నల్ ఎల్‌వి.మోనిష్ అన్నారు. గురువారం జడ్‌పి హైస్కూల్ (తెలుగు)లోని ఎన్‌సిసి శిక్షణ కేంద్రాన్ని మేనేజర్ లోకనాథన్‌తో కలసి సందర్శించారు. ఎన్‌సిసి విద్యార్థుల చేత సిటిఒ వెంకటగోపాల్ వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణ అనేది క్రమశిక్షణకు మారుపేరని, విద్యార్థి దశలో నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, దేశం పట్ల భక్తి భావాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఎన్‌సిసితో పాటు చదువులలోనూ రాణిస్తూ భవి ష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్రమ శిక్షణ కలిగిన విద్యార్థి తన జీవి తంలోని ప్రతి సందర్భంలోనూ విజయ వంతంగా ముందుకు సాగ గలరని వివరించారు. ఎన్‌సిసితో విద్యార్థులతో దేశభక్తితో పాటు క్రమ శిక్షణ అలవ డుతుందన్నారు.ఈ పాఠశాల విద్యార్థులు అనతి కాలంలోనే ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రత్యేక శిక్షణ శిబిరాలకు ఎంపిక అవుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఒ వెంకటగోపాల్, ఉపాధ్యాయులు వాణిరవి, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

# 7న 'మెగా పేరెంట్ టీచర్' సమావేశం : కలెక్టర్

**ప్రజాశక్తి-రాయచోటి**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డిసెంబర్ 7న ఒక పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులకు మెగా పేరెంట్ టీచర్ సమావేశ నిర్వహణపై ఒక రోజు జిల్లాస్థాయి అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలోని 20178 పాఠశాలల్లో డిసెంబర్ 7న ఒక పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్ సమా వేశాన్ని నిర్వహించాలని చెప్పారు. విద్య కోసం, విద్యా భివృద్ధి, పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని నిర్వహించాలని సంక ల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమం ఉత్సాహపూర్వక పండుగ వాతావరణం లో జరగాలని సూచించారు. విద్యా ర్థుల తల్లిదండ్రులందరినీ తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లల చేత తల్లి దండ్రులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. విద్యార్థులం దరికీ డిసెంబర్ 7న హొలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేయాలిన్నారు. వీటిని 2వ తేదీనే పూర్తి చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించి విజయ వంతం చేయాలన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదని, రాజకీయ ప్రసంగాలు ఉండరాదన్నారు. కార్యక్ర మంలో భాగంగా ఆ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి వెళ్లిన వారి విజయ గాథలు విద్యార్థులకు వివరించాలన్నారు. అతిథులతో విద్యార్థులను ప్రోత్స హించేలా మాట్లాడించాలని, తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. ఎంఇఒలు ,హెడ్మాస్టర్లు, టీచర్లు అందరూ సమన్వయంగా కార్యక్రమాన్ని సుహృద్భావ వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. అపార్ ఐడి జనరేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ కరుణాకర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

## అంగన్వాడీ కేంద్రాల్లో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-కలికిరి**

మండల పరిధిలో కందుకూరులోని అంగన్వాడీ కేంద్రాలను సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అకస్మికతనికి నిర్వహించారు. గురువారం ఉదయం కలికిరి పట్టణంలోని కలికిరి1, 4వ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు టిహెచ్‌ఆర్, గర్భిణులు, బాలింతల రిజిస్టర్, అనుబంధ పోషకాహారం నిల్వ రిజిస్టర్, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ మొదలగు వాటి గురించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫుడ్ స్టాకుపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు పోషకా హారం సక్రమంగా అందించాలని, పిల్లలు ప్రతిరోజూ హాజరయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా కార్యకర్తలు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు నిరుపయోగమైన వస్తువులకు వేలంపాట

**ప్రజాశక్తి - బి.కొత్తకోట**

నగర పంచాయతీ కార్యాలయం నందు నిరుపయోగంగా ఉన్న వస్తువులకు రేపు అనగా శనివారం వేలం పాటలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పల్లవి పేర్కొన్నారు.ఈ వేలంపాటలో పాల్గొనదలుచుకునేవారు ఈనెల 30న 11 గంటలలోపు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించాలని తెలి పారు. ఉదయం 11.30 గంటలకు వేలంపాట ప్రారంభమవుతుందన్నారు. ధరావత్తు చెల్లించి ఈ వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చునని చెప్పారు. వివరాలకు నగర పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

## నేడు కొత్తపల్లికి మంత్రి 'మండిపల్లి' రాక

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఆర్అండ్ఆర్ కాలనీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పర్యటిస్తారని ఎంపిడిఒ దివ్య తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు మంత్రి దృష్టికి తీసుక రావాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, అందరూ తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

## విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి ఆహ్వానం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

రాజంపేటలోని న్యూ ఆంధ్ర ఫంక్షన్ హాల్లో డిసెంబర్ 12న జరిగే ప్రపంచ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవానికి హాజరు కావాలని టిడిపి యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిని ఆహ్వానించినట్లు మల్లు సుబ్బ నరసారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, రైల్వే కోడూరు అధ్యక్షుడు ధనుంజయ, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, సెక్రటరీ వెంకటప్రసాద్, సమీ పాల్గొన్నారు.

సాయివికాస్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

# క్రైం కార్నర్

స్వాధీనం చేసుకున్న దుంగలు, పట్టుబడిన స్మగ్లర్లతో డిఎస్‌పి, పోలీసు సిబ్బంది

## 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

జిల్లాలోని వీరబల్లి మండలం గడికోట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 12 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8.50లక్షలు విలువ చేసే 20 ఎర్రచందనం దుంగలను, 9 లక్షలు విలువ చేసే ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు రాయ చోటి డిఎస్‌పి కృష్ణమోహన్ పేర్కొన్నారు. గురువారం డిఎస్‌పి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ముందస్తు రాబడిన సమాచారం మేరకు రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్, వీరబల్లి, సుండుపల్లి, సంబేపల్లి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కలిసి వీరబల్లి మండలం గడికోట అటవీ ప్రాంతంలో కూబింగ్ చేస్తుండగా ఇన్నోవా కారులో ఎర్రచం దనం దుంగలను తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేసి 12 మంది స్మగ్లర్లు ను అదుపులోకి తీసుకుని 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ వారిలో ఒకరు కడప జిల్లా ప్రొద్దుటూరు చెందిన వ్యక్తి కాగా, మిగిలిన వారందరూ తమిళనాడు కు చెందిన వారిగా గుర్తించామని అన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## ధర్మవరం సిఐ నాగేంద్ర తల్లి హత్య కేసులో..
## నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

అరెస్టు చూపుతున్న పోలీసులు

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ధర్మవరం సిఐ నాగేంద్ర తల్లి స్వర్ణకుమారి హత్య కేసులో నిందితుడు అనిల్‌ను అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలుకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. గురువారం సాయంత్రం సిఐ మీడి యాతో మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లిలో ఈ ఏడాది సెప్టెంబర్ 28న మండలంలోని కోళ్ల బైలు గ్రామం, జగన్ కాల నీలో కాపురం ఉండే వెంకటేష్, నీరుగట్టువారిపల్లె గజ్జలకుంటలో ఉండే అనిల్‌తో కలసి బంగారు నగల కోసం అనిల్ ఇంట్లోనే మంత్రాల నేపంతో స్వర్ణ కుమారిని హత్య చేశారన్నారు. ఈ కేసులో వెంకటేష్‌ను ఇప్పటికే అరెస్టు చేయగా, పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్న అనిల్ ములకలచెరువు వద్ద ఈనెల 24న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని చెప్పారు. 108 సిబ్బంది మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించడంతో ప్రాణపాయం తప్పి కోలుకు న్నాడని అన్నారు. ఆస్పత్రిలో చేరి పోలీసులకు చిక్కిన అనిల్‌ను గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తెలిపారు.